సాక్షి నల్లగొండ

శుక్రవారం । 14 । జూలై । 2023



కానిస్టేబుల్ అత్యుత్సాహం

డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లో ట్రాఫిక్ కానిస్టేబుల్ ఓ వ్యక్తిని లాఠీతో కొట్టడంతో అతడి చేతి వేళ్లు విరిగాయి.

- IIలో



శిథిలావస్థలో అతిథి గృహం

మూసీ ప్రాజెక్టు వద్ద గల అతిథి గృహానికి దశాబ్ద కాలంగా మరమ్మతులు లేక శిథిలావస్థకు చేరింది.

- IIలో

గరిష్టం/కనిష్టం
34°/25°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నల్లగొండ ఆర్‌డీఓగా రవీందర్‌రావు



బాధ్యతలు స్వీకరించిన రవీందర్‌రావు

నల్లగొండ: నల్లగొండ ఆర్‌డీఓగా నెవర గొమ్ముల రవీందర్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కీసర నుంచి బదిలీపై నల్లగొండకు వచ్చారు. 2005 వరకు ఉపాధ్యాయుడిగా పనిచేసిన రవీందర్‌రావు 2005 గ్రూప్‌–2కు ఎంపిక య్యారు. కొన్నేళ్లకు పదోన్నతి పొందిన ఆయన వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్‌డీఓగా మూడేళ్లు పనిచేశారు. ఆ తర్వాత కీసరలో నాలుగేళ్లు ఆర్‌డీఓగా పనిచేసి ప్రస్తుతం నల్లగొండకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ అధికారుల సహకారంతో డివిజన్‌లోని భూ సమస్యల తోపాటు ఇతర ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ఇంటర్ అడ్మిషన్లకు 15న స్పాట్ కౌన్సిలింగ్

రామగిరి(నల్లగొండ): నల్లగొండ, సూర్యాపేట జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 15న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ఎస్సీ గురుకులాల ఆర్‌సీఓ అరుణకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 2023న ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణులైన వారు సూర్యాపేటలోని చివ్వెంల గురుకుల బాలుర కళాశాల నందు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని కోరారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు 16న స్క్రీనింగ్ టెస్టు

నల్లగొండ: సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యేందుకు ఇచ్చే ఉచిత శిక్షణకు తెలంగాణ రాష్ట్ర బీసీ స్టడీ సర్కిల్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 16న స్క్రీనింగ్ టెస్టు నిర్వహించనున్నట్లు స్టడీ సర్కిల్ సిబ్బంది గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టికెట్‌ను సంబంధిత వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, అరగంట ముందుగా పరీక్ష కేంద్రానికి హాజరుకావాలని పేర్కొన్నారు. ఏమైనా సందేహాలుంటే ఫోన్ నంబర్ 08682–220007 లేదా నల్లగొండ పట్టణంలోని తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మూడో రోజు ఐటీఐ పరీక్షలు



ఆన్‌లైన్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నల్లగొండ: ఐటీఐ వార్షిక పరీక్షలు గురువారం మూడో రోజుకు చేరాయి. జిల్లాలోని నాలుగు ప్రభుత్వ, ఆరు ప్రైవేట్ ఐటీఐ కళాశాలలకు చెందిన విద్యార్థులకు నల్లగొండలోని మార్కొని ఐటీఐలో ఆన్‌లైన్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. రోజుకు 3 షిఫ్టుల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్ల సస్పెన్షన్

నల్లగొండ టూటౌన్: నీలగిరి మున్సిపాలిటీకి చెందిన ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లను సస్పెండ్ చేస్తూ మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణాచారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముర్తుజా అలీ, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌లు విధి నిర్వహణలో అలసత్వం వహించడం, విధుల్లో సరిగా ఉండకపోవడం వంటి కారణాలపై ఫిర్యాదులు రావడంతో ఆ ఇద్దరిపై కమిషనర్ సస్పెన్షన్ వేటు విధించినట్లు తెలుస్తోంది.

ఆర్టీసీలో యూనియన్ ఎన్నికలు నిర్వహించాలి

నల్లగొండ రూరల్: ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్లపై ఉన్న ఆంక్షలను ఎత్తివేసి కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ ఆర్టీసీ జేఏసీ నాయకులు పలువురు గురువారం నల్లగొండ పట్టణంలో జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రజల అవసరాల మేరకు బస్సుల సంఖ్య పెంచాలని కోరారు. అలాగే, అవసరం మేరకు కొత్త సిబ్బంది నియామకాలు చేపట్టాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ సందర్భంగా విన్నవించారు. వినతిపత్రం అందించిన వారిలో ఆర్టీసీ జేఏసీ నాయకులు నరసింహ, రాజు, స్వామి, నరసింహ ఉన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు

492 మందిని వివిధ స్కూళ్లకు కేటాయించిన విద్యాశాఖ

- జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉంటే పక్క స్కూళ్లకు..
- ఉపాధ్యాయులు ఎక్కువుంటే అవసరమున్న చోటుకు స్థానచలనం
- తక్కువ మంది పిల్లలుంటే ఇతర పాఠశాలలకు పంపిస్తూ ఉత్తర్వులు



నల్లగొండ: పిల్లలు లేక ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యా శాఖ ఉపాధ్యాయులను వివిధ స్కూళ్లలో సర్దుబాటు చేసింది. ఇప్పటికే 492 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి జిల్లాకు జాబితాను పంపించింది.

డీఈఓ కార్యాలయానికి చేరిన జాబితా..

జిల్లాలో ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూళ్లతోపాటు, హైస్కూళ్లలో జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థుల కంటే ఎక్కువగా ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులను అక్కడి నుంచి వేరే స్కూళ్లకు పంపిస్తూ విద్యా శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఇప్పటికే గుర్తించిన ఉపాధ్యాయులను ఏయే పాఠశాలలకు కేటాయించారో అందుకు సంబంధించిన జాబితాను డీఈఓ కార్యాలయం నోటీస్ బోర్డుపై ఉంచారు. ఈ విషయమై టీచర్లకు మెసేజ్ పంపారు. అయితే సర్దుబాటు విషయంలో ఎంఈఓలు వారికి అనుకూలంగా ఉన్న ఉపాధ్యాయులను వారు అనుకున్న చోటుకు సర్దుబాటు చేసేవిధంగా సహకరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే విద్యాశాఖ ఆదేశాల మేరకు 10మంది లోపు ఉన్న పాఠశాలలను మూసి వేస్తే అందులోని టీచర్ల కూడా ఇతర స్కూళ్లలో సర్దుబాటు చేసే అవకాశం ఉంది. గతంలో కొందరు టీచర్లు ఎక్సెస్ ఉంటే వారిని ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేసినా వారు వెళ్లకుండా పైరవీలు నడిపి పాత స్కూళ్లోనే ఉండిపోయారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ సారి సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలలకు వెళ్తారో వెళ్లరో వేచి చూడాలి.

తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య..

ప్రభుత్వ స్కూళ్ల బలోపేతం చేసేందుకు ప్రభుత్వం మన ఊరు – మన బడి కార్యక్రమం తీసుకొచ్చింది. అన్ని ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉంచాలని మౌలిక సౌకర్యాలు కల్పిస్తోంది. తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచుతూ.. పేద విద్యార్థులకు గ్రామంలోనే నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం అందించాలని నిర్ణయించింది. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఏటేటా తగ్గుతూ వస్తోంది. జిల్లాలో 1,483 ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలు ఉండగా అందులో 300 పాఠశాలల వరకు మూత పడే అవకాశం ఉంది. ఇందులో కొన్ని పాఠశాలలు జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్నాయి. ప్రస్తుతం విద్యాశాఖ 10 మంది విద్యార్థుల కంటే తక్కువగా ఉన్న పాఠశాలలను ఈ విద్యా సంవత్సరం మూసివేసి అందులోని విద్యార్థులను పక్క పాఠశాలల్లో చేర్పించి అక్కడ ఉన్న ఉపాధ్యాయులను కూడా విద్యార్థులున్న పాఠశాలలకు సర్దుబాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అందులో భాగంగానే విద్యా శాఖ అధికారులు సర్దుబాటుకు చర్యలు తీసుకున్నారు.

• బీఆర్ఎస్ ఆగ్రహ జ్వాల



ఉచిత విద్యుత్‌పై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం నల్లగొండలో ఆయన దిష్టిబొమ్మకు ఉరివేసి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

రిటర్నింగ్ అధికారుల నియామకం

నల్లగొండ : రాబోయే సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అసెంబ్లీ నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ నియమించారు. ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాలకు రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల పేర్లను గురువారం ప్రకటించారు.

నియోజకవర్గం	రిటర్నింగ్ అధికారి
దేవరకొండ (ఎస్టీ)	ఆర్డీఓ, దేవరకొండ
నాగార్జునసాగర్	అదనపు కలెక్టర్(రెవెన్యూ), నల్లగొండ
మిర్యాలగూడ	ఆర్డీఓ, మిర్యాలగూడ
హుజూర్‌నగర్	ఆర్డీఓ, హుజూర్‌నగర్
కోదాడ	ఆర్డీఓ, కోదాడ
సూర్యాపేట	ఆర్డీఓ, సూర్యాపేట
నల్లగొండ	ఆర్డీఓ, నల్లగొండ
మునుగోడు	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్‌అండ్‌ఆర్, ఎల్ఏ, యూనిట్–2 నల్లగొండ
భువనగిరి	ఆర్డీఓ, భువనగిరి
నకిరేకల్(ఎస్సీ)	అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), నల్లగొండ
తుంగతుర్తి(ఎస్సీ)	అదనపు కలెక్టర్(రెవెన్యూ), సూర్యాపేట
ఆలేరు	అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), భువనగిరి

అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు వీరే..

దేవరకొండ నియోజకవర్గం : పీఏపల్లి, దేవరకొండ, చింతపల్లి, గుండ్లపల్లి, చందంపేట, నేరడుకొమ్ము, కొండమల్లేపల్లి తహసీల్దార్లు
నాగార్జునసాగర్ : నిడమనూరు, త్రిపురారం, అనుముల, పెద్దవూర, గుర్రంపోడు, తిరుమలగిరి(సాగర్) తహసీల్దార్లు
మిర్యాలగూడ : వేములపల్లి, మిర్యాలగూడ, దామరచర్ల, అడవిదేవులపల్లి, మాడ్గులపల్లి తహసీల్దార్లు
హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్, నేరేడుచర్ల, గరిడేపల్లి, మఠంపల్లి, మేళ్లచెరువు, పాలకవీడు, చింతలపాలెం తహసీల్దార్లు
కోదాడ : కోదాడ, నడిగూడెం, చిలుకూరు, మోతె, అనంతగిరి, మునగాల తహసీల్దార్లు
సూర్యాపేట : సూర్యాపేట, ఆత్మకూర్.ఎస్, చివ్వెంల, పెన్‌పహాడ్ తహసీల్దార్లు
నల్లగొండ : తిప్పర్తి, నల్లగొండ, కనగల్ తహసీల్దార్లు
మునుగోడు : చౌటుప్పల్, మునుగోడు, నారాయణపూర్, మర్రిగూడ, నాంపల్లి, చండూరు, గట్టుప్పల తహసీల్దార్లు
భువనగిరి : భువనగిరి, బీబీనగర్, భూదాన్ పోచంపల్లి, వలిగొండ తహసీల్దార్లు,
నకిరేకల్ : కట్టంగూర్, నకిరేకల్, కేతేపల్లి, రామన్నపేట, నార్కట్‌పల్లి, చిట్యాల తహసీల్దార్లు
తుంగతుర్తి : తిరుమలగిరి, తుంగతుర్తి, నూతనకల్, జాజిరెడ్డిగూడెం, శాలిగౌరారం, మోత్కూర్, అడ్డగూడూరు, మద్దిరాల, నాగారం తహసీల్దార్లు
ఆలేరు నియోజకవర్గం : ఆలేరు, ఆత్మకూరు.ఎం, బొమ్మలరామారం, గుండాల, మోటకొండూర్, రాజాపేట, తుర్కపల్లి, యాదగిరిగుట్ట తహసీల్దార్లు

• కళ్లకు గంతలు కొట్టుకొని నిరసన



తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ గురువారం మునుగోడులో కళ్లకు గంతలు కట్టుకొని సమ్మెలో కూర్చున్న గ్రామ పంచాయతీ కార్మికులు

చేనేత కార్మికులను ఆదుకోవాలి

నల్లగొండ టౌన్ : చేనేత కార్మికుల వద్ద ఉన్న కోట్లాది రూపాయల విలువ గల వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంజి మురళీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండలోని సంఘం కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత కార్మికులు నేసిన వస్త్రాలకు సరైన మార్కెట్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. చేనేత వస్త్రాలపై విధించిన జీఎస్టీ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా చేనేత కార్మికులకు నూలు, ఇతర పరికరాలపై సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వానికి విన్నవించారు. చేనేత కార్మికులకు ఇంటి స్థలాలు, ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షలు రూపాయల సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం నాయకులు కర్నాటి శ్రీరంగం, రాపోలు వెంకన్న, రావిరాల మారయ్య, గోశిక నరసింహ, వనం గణేశ్, వెంకటేశం, ఏలె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’కు మౌలిక సదుపాయాలు కల్పించాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన వివిధ శాఖల అధికారులు

నల్లగొండ: పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయాల వద్ద మౌలిక సదుపాయాల కల్పన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ తన చాంబర్‌లో హౌసింగ్ పీడీ, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మొత్తం 8,155 డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు కాగా, 294 ఇళ్లను పంపిణీ చేశామన్నారు. 2,593 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తయి పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మండల స్థాయిలో ఏదైనా సమస్యలు ఉంటే ఆర్డీఓలు, తహసీల్దార్లతో చర్చించాలన్నారు. అప్పటికి సమస్యలు పరిష్కారం కాకపోతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆయన అధికారులను కోరారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ రాజకుమార్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నరసింహ, పీఆర్ ఎస్ఈ జేజీవీకే.ప్రకాష్, పంచాయతీ రాజ్ శాఖ నల్లగొండ ఈఈ కె.తిరుపతయ్య, మిర్యాలగూడ ఈఈ మాధవి, ఆర్‌అండ్‌బీ ఈఈ నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష ఆర్థికసాయానికి 40, 810 దరఖాస్తులు

రూ.లక్ష ఆర్థికసాయం పథకానికి జిల్లాలో మొత్తం 40, 810 దరఖాస్తులు చేసుకున్నారని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం బీసీలకు రూ.లక్ష ఆర్థికసాయంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో కరీంనగర్ జిల్లా కేంద్రం నుంచి బీసీ సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హాజరై మాట్లాడారు. వీడియో కాన్ఫరెన్స్‌కు హైదరాబాద్ నుంచి బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, నల్లగొండ నుంచి జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఖాజా నిజాం అలీ అఫ్సర్ హాజరయ్యారు.

నేను రాజీనామా చేస్తా.. మీరు చేస్తారా..?

- విద్యుత్ సరఫరాపై ఎంపీ కోమటిరెడ్డికి ఎమ్మెల్యే భాస్కర్‌రావు సవాల్



మిర్యాలగూడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ టౌన్: వ్యవసాయ రంగానికి 3, 4, 5 గంటలు కూడా విద్యుత్ సరఫరా చేయడం లేదని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు చాలెంజ్ చేయడం కాదు..నేను చాలెంజ్ చేస్తున్నా.. మిర్యాలగూడ నియోజకవర్గంలో ఏ సబ్‌స్టేషన్ అయినా ఏంచుకో 15 గంటలకు తక్కువగా విద్యుత్ సరఫరా చేస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా.. మీరు ఎంపీ పదవికి రాజీనామా చేస్తారా..? అని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మిర్యాలగూడ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు సవాల్ విసిరారు. గురువారం మిర్యాలగూడలో విశ్వకర్మ కమ్యూనిటీ భవనం శంకుస్థాపన అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని విద్యుత్ ప్రధాన కార్యాలయానికి రా.. అక్కడ 3, 4, 5గంటలే ఇస్తున్నట్లు నిరూపిస్తే ఇక్కడి నుంచే నేరుగా స్పీకర్ వద్దకు వెళ్లి రాజీనామా లేఖ ఇస్తాను.. అంతకంటే ఎక్కువ గంటలు ఇస్తున్నట్లు ఉంటే మీరు కూడా నేరుగా పార్లమెంట్‌కు వెళ్లి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి ఇస్తున్న ఉచిత విద్యుత్ సరఫరాపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యాలు సరైనవి కావన్నారు. ఇప్పటి నుంచి కాంగ్రెస్ నాయకుల ఇళ్ల 3 గంటలకు కంటే ఎక్కువ కరెంట్ ఇవ్వవద్దన్నారు.

అధిక జనాభాతో అనర్థాలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ కొండల్‌రావు

నల్లగొండ టౌన్: అధిక జనాభాతో అనర్థాలు ఉంటాయని.. కుటుంబ నియంత్రణ ద్వారా జనాభాను అరికట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ కొండల్‌రావు అన్నారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా డీఎంహెచ్ఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా నియంత్రణలో ఆడవారిపై భారం వేయకుండా మగవారు కూడా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కుటుంబ నియంత్రణలో అందరు భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించడంలో విశేష సేవలందించిన నర్సులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు అవార్డులతోపాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డెమో రవిశంకర్, ఎస్ఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ అర్జీలపై విచారణ

- నందికొండ మున్సిపాలిటీలో మొదలైన ప్రక్రియ
- వారం రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశం
- ఇప్పటికే ఐదు బృందాల నియామకం
- జీఓ 58లో 943.. జీఓ 59 ప్రకారం 1,388 దరఖాస్తులు



హిల్‌కాలనీలో విచారిస్తున్న మిర్యాలగూడ ఆర్డీఓ చెన్నయ్య, పెద్దవూర తహసీల్దార్ సైదులుగౌడ్

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీలోని ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసముంటూ వాటి క్రమబద్ధీకరణకు చేసుకున్న దరఖాస్తులపై విచారణ మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూముల్లో నిర్మించుకున్న ఇళ్లు, కబ్జాలో ఉంచుకున్న ఇంటిస్థలాలను నెలరోజుల్లోగా క్రమబద్ధీకరించి, మంత్రులు, ఎమ్మెల్యేల చేతులమీదుగా పంపిణీ చేయాలని కేబినెట్ సబ్‌కమిటీ ఆదేశించింది. దీంతో నందికొండలో క్రమబద్ధీకరణ దరఖాస్తులపై విచారణ చర్యలు తీసుకుంటున్నారు. దీంట్లో భాగంగా అదనపు కలెక్టర్ పర్యవేక్షణలో మిర్యాలగూడ ఆర్డీఓ చెన్నయ్యతో కలిపి ఐదు టీంలను జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేశారు. వారం రోజుల్లో విచారణ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో పెద్దవూర, తిరుమలగిరి(సాగర్), నిడమనూరు, త్రిపురారం మండలాల తహసీల్దార్ల ఆధ్వర్యంలో విచారణ చేయనున్నారు. విచారణ జరిపిన దరఖాస్తులను ఏరోజు కారోజు ఆన్‌లైన్‌నే సబ్మిషన్ చేస్తారు. వాటిని పరిశీలించి వెంటనే జీఓ 59కి సంబంధించిన ఇంటి నిర్మాణం ఖాళీ స్థలాన్ని బట్టి రేటు వేసి డిమాండ్ నోటీసును ఆయా దరఖాస్తుదారుల సెల్‌ఫోన్‌లకే మేసేజ్ రూపంలో పంపనున్నారు. నగదు చాలాన్ రూపేనా చెల్లించగానే వారికి ఆఇంటిని రిజిస్ట్రేషన్ సంబంధిత తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేస్తారు.

ఇళ్లు, ఇళ్ల స్థలాలన్నీ ఎన్నెస్పీవే..

నందికొండ మున్సిపాలిటీలో ఉన్న ఇళ్లు, ఇళ్ల స్థలాలన్నీ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు సంబంధించినవే. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, కూలీలు నివాస ముండేందుకు తాత్కాలికంగా క్వార్టర్లను నిర్మించారు. ఆ ఇళ్లలో ఉండే వారు దరఖాస్తు చేసుకోగా మొదటి దఫాలో సుమారుగా 1,300మందికి ఇళ్లు రిజిస్ట్రేషన్లు అయ్యాయి. అవగాహన లేక చాలామంది దరఖాస్తు చేసుకోలేదు. వారికి అవకాశం కల్పించడంతో మే 31వరకు దరఖాస్తులు చేశారు. అయితే జీఓ 58 ప్రకారం 943మంది దరఖాస్తు చేసుకోగా జీఓ 59 ప్రకారం 1,388మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను వారంలోగా విచారణ చేయాల్సి ఉంది.

నివాసితులంతా సహకరించాలి

“నివాసితులంతా ఇళ్ల వద్దనే ఉండి విచారణకు సహకరించాలి. మీ ఇళ్ల వద్దకే టీం సభ్యులు వస్తారు. క్రమబద్ధీకరణకు చేసుకున్న దరఖాస్తుతో పాటు ఆ ఇంట్లో 2020 జూన్ 2లోపు నుంచే నివాసితులుగా ఉంటున్నట్లుగా రుజువులు చూయించాలి. అలాట్‌మెంట్ ఆర్డర్, విద్యుత్ బిల్లు తదితర రుజువులనూ చూస్తారు.

– చెన్నయ్య, ఆర్డీఓ, మిర్యాలగూడ

‘టీ-9’ తీసుకోండి

దేవరకొండ: ఆర్టీసీ బస్సు సర్వీసుల్లో కొత్తగా ప్రవేశపెట్టిన టీ–9 (టికెట్ – ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు)ను సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ రాజీవ్ ప్రేమ్‌కుమార్ ప్రయాణికులకు సూచించారు. గురువారం దేవరకొండ ఆర్టీసీ బస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రూ.60తో టీ–9 టికెట్ తీసుకోవడం ద్వారా 60 కి.మీ. వ్యవధిలో పల్లె వెలుగు బస్సుల్లో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రయాణం చేయవచ్చని పేర్కొన్నారు. 12 ఏళ్లు పైబడిన బాలికలతోపాటు 60 ఏళ్లు పైబడిన వృద్ధులు, మహిళలు ఈ టికెట్ తీసుకోవచ్చన్నారు. ఆయన వెంట అసిస్టెంట్ మేనేజర్ భారతీబాయి, సిబ్బంది ఉన్నారు.



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న డిపో మేనేజర్ రాజీవ్ ప్రేమ్‌కుమార్

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి



వింజమూరులో పత్తి చేనులో గుంటుక తోలుతున్న జిల్లా వ్యవసాయాధికారి సుచరిత

- జిల్లా వ్యవసాయ అధికారి సుచరిత

చింతపల్లి: గ్రామాల్లో రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా సర్వే నంబర్ల వారీగా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి సుచరిత సూచించారు. గురువారం చింతపల్లి మండలం వింజమూరు గ్రామంలో పంట చేనులను ఆమె పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఓ రైతు చేనులో ఆమె స్వయంగా గుంటుక కొట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులు, క్రిమిసంహారక మందుల కొనుగోలు విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం వింజమూరు ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఆమె వెంట ఏడీఏ వీరప్ప, ఏఓ రామలింగేశ్వరరావు, ఏఈఓలు నర్సింహ, మధు ఉన్నారు.

క్లుప్తంగా

చోరీ చేస్తూ పట్టుబడిన ఇద్దరికి దేహశుద్ధి

ఆలేరురూరల్: కార్యకర్తల జేబులో నుంచి ఇద్దరు దొంగలు డబ్బులు చోరీ చేస్తుండగా వారిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఈ సంఘటన ఆలేరు పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ కేంద్రంలోని ఏఎస్ఆర్ గార్డెన్‌లో గురువారం మార్కెట్ కమిటీ నూతన ప్రమాణస్వీకారోత్సవానికి వచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తల జేబులో చేయి పెట్టి ఇద్దరు వ్యక్తులు డబ్బులు చోరీ చేయబోయారు. గమనించిన కార్యకర్తలు వారిని పట్టుకొని దేహశుద్ధి చేసి అక్కడ ఉన్న పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఆలేరు ఎస్సై వెంకట శ్రీను తెలిపారు.

న్యాయం చేయాలి..

- వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపిన మున్సిపల్ కార్మికుడు

చండూరు: తనకు న్యాయం చేయాలని కోరుతూ చండూరు మున్సిపాలిటీ కార్మికుడు జిట్టగోని నర్సింహ గురువారం రాత్రి స్థానిక సెంటర్‌లో వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన తెలిపాడు. పోలీసులు, బాధితుడి తల్లిదండ్రులు, ఓ ప్రజాప్రతినిధి ఫోన్ ద్వారా అతడికి సర్దిచెప్పడంతో అరగంట తర్వాత ట్యాంకు దిగాడు. ఈసందర్భంగా కార్మికుడు నర్సింహ మాట్లాడుతూ మూడేళ్ల క్రితం మున్సిపల్ కార్యాలయంలో రూ.2 లక్షలు తీసుకుని పారిశుద్ధ్య కార్మికుడిగా ఓ ప్రజాప్రతినిధి నియమించారని తెలిపాడు. కానీ తన నియామకంపై ఉన్నత అధికారుల ఆమోదం లేదని కార్యాలయం అధికారులు నెలానెలా వేతనం ఇవ్వడం లేదని వాపోయాడు. తన పేరును కార్యాలయంలో ఎందుకు నమోదు చేయడం లేదని అడిగితే.. ఆ ప్రజాప్రతినిధికి చెందిన వారి నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని తెలిపాడు. తనకు న్యాయం చేయాలని కోరాడు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

భువనగిరి: మహిళ మెడలో పుస్తలతాడును గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకునివెళ్లాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి భువనగిరి పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం .. పట్టణంలోని శ్రీరాంనగర్‌కు చెందిన కొండమడుగు శివాని స్థానిక గంజ్‌లో ఓ కిరాణం షాపులో పనిచేస్తుంది. రోజు మాదిరిగా పని ముగించుకుని సుమారు రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి వెళ్తోంది. ఈ క్రమంలో శ్రీరాంనగర్‌కు వెళ్లే మార్గంలో రైల్వే లైన్ దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఆమె మెడలో ఉన్న సుమారు 3 తులాల బంగారం పుస్తెలతాడును లాక్కొని పారిపోయాడు. బాధితురాలు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పశువులను రవాణా చేస్తున్న వాహనం పట్టివేత

చిట్యాల: జాతీయ రహదారి మీదుగా చిట్యాల పట్టణ శివారులో మూడు డీసీఎం వాహనాల్లో అక్రమంగా రవాణా చేస్తున్న 181 పశువులను గురువారం పట్టుకున్నట్లు చిట్యాల ఎస్‌ఐ ఇరుగు రవి తెలిపారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపునకు మూడు డీసీఎంలల్లో అక్రమంగా పశువులు రవాణా అవుతుండగా చిట్యాల పట్టణ శివారులోని జాతీయ రహదారిపై రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారి వద్ద పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడ్డాయి. ఈ మూడు వాహనాల్లో 181 పశువులుండగా వాటిలో 101 ఆవులు, 80 ఎద్దులున్నాయి. ఈమేరకు పశువుల అక్రమ రవాణాకు పాల్పడుతున్న రమావత్ శ్రీను, కేతావత్ బాద్య, ధరావత్ నగేష్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

శిథిలావస్థలో 'మూసీ' అతిథి గృహం

- కూలిపోయే దశలో భవనం పైకప్పు
- మరమ్మతులకు నిధులు కేటాయించని ప్రభుత్వం
- భవనం లేక సమీక్ష సమావేశాలు నిర్వహించేందుకు ఇబ్బంది



శిథిలావస్థకు చేరిన మూసీ అతిథి గృహం



కూలిపోయే దశలో సిబ్బంది క్వార్టర్లు

కేతేపల్లి: నాగార్జునసాగర్ తర్వాత రెండో అతిపెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు వద్ద గల అతిథి గృహానికి దశాబ్ద కాలంగా మరమ్మతులు లేక శిథిలావస్థకు చేరింది. ఈ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా మార్చాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఇక్కడ అతిథి గృహం నిర్మించింది. తొలినాళ్లలో అతిథి గృహ పరిసరాల్లోని పార్కులు, పూలతోటలు, వాటర్ ఫౌంటెన్‌లు ఏర్పాటు చేశారు. ఈ ఆవరణలోనే సిబ్బందికి క్వార్టర్లు సైతం నిర్మించారు. ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన రాష్ట్రస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ అతిథి గృహంలోనే విశ్రాంతి తీసుకునేవారు. రానురాను నిధుల కొరత, నిర్వహణ లోపంతో మూసీ అతిథి గృహంతో పాటు, పరిసర ప్రాంతాలు అందాలను కోల్పోయాయి. అతిథి గృహం భవనం పైకప్పు కూలే దశలో ఉంది. 2014లో మూసీ ప్రాజెక్టు ఆధునీకరణకు రూ.18 కోట్లు కేటాయించిన ప్రభుత్వం, మరమ్మతులను పట్టించుకోలేదు. 2018లో మూసీ కుడి, ఎడమ కాల్వల ఆధునీకరణకు ప్రభుత్వం రూ.65 కోట్లు మంజూరు చేసినప్పటికీ, వసతి గృహానికి ఒక్క పైసా కేటాయించలేదు.

ఇబ్బందులకు గురవుతున్న అధికారులు, సిబ్బంది

మూసీ రిజర్వాయర్ నుంచి కుడి, ఎడమ కాల్వల పరిధిలో దాదాపు 35వేల ఎకరాలకు పైగానే సాగు నీరు అందుతుంది. వర్షాకాలంలో ప్రాజెక్టు గేట్లు ఎత్తిన సమయంలో కింది స్థాయి సిబ్బందితో పాటు, ప్రాజెక్టు ఉన్నతాధికారులు సైతం 24 గంటలు డ్యాం వద్దనే మకాం వేయాల్సి ఉంటుంది. ప్రాజెక్టు నిర్వహణను పర్యవేక్షించే అధికారులు, కిందిస్థాయి ఉద్యోగులకు రెస్ట్ హౌస్ లేకపోవటంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రాజెక్టు సందర్శనకు వచ్చే మంత్రులు, ఎమ్మెల్యేలు, నీటిపారుదల శాఖ అధికారుల ప్రాజెక్టు నిర్వహణపై మూసీ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించేందుకు కూడా ఇబ్బందిగా మారింది. డ్యామ్ వద్ద ఉన్న చిన్నపాటి ఇరుకైన గదిలోనే సమావేశాలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆక్రమణకు గురవుతున్న ఆవరణ

అతిథి గృహం ఆవరణ చుట్టూ ప్రహరీ లేక నలువైపులా ఆక్రమణకు గురవుతోంది. ఇనుప వైరుతో వేసిన ఫెన్సింగ్ ఆనవాలు లేకుండా పోయింది. అతిథి గృహం ఆవరణ చుట్టూ వ్యవసాయ భూములు ఉన్న రైతులు ఏటేటా సాగు చేసుకుంటూ ఆవరణలోకి చొచ్చుకొస్తున్నారు. పశువులు, గొర్రెలు ఆవరణలో తిరుగుతుండటంతో పచ్చదనం కోల్పోయింది. అధికారులు భవనాన్ని పట్టించుకోకపోవటంతో మందు బాబులకు నిలయంగా మారింది ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అతిథి గృహం మరమ్మతులకు నిధులు మంజూరు చేసి వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు కోరుతున్నారు.

నిధులు కేటాయించాలి



“ రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన మూసీ అతిథి గృహ భవన నిర్వహణను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రెస్ట్ హౌస్ లేక ప్రాజెక్టు సందర్శనకు వచ్చే వీఐపీలు, విధులు నిర్వహించే అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. భవనం మరమ్మతులకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసి వినియోగంలోకి తీసుకురావాలి.

– పెరుమాళ్ల శేఖర్, ఎంపీపీ, కేతేపల్లి

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం



“ నిధుల కొరత కారణంగా మూసీ ప్రాజెక్టు వద్ద నిర్మించిన అతిథి గృహానికి మరమ్మతులు చేయలేదు. మరమ్మతుల కోసం గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తేనే పనులు చేపట్టే అవకాశముంది.

– చంద్రశేఖర్, మూసీ డీఈ

ఎక్సైజ్ పోలీసుల దాడులు



చింతలకుంట తండాలో బెల్లం పానకం పారబోస్తున్న పోలీసులు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మండలం చింతలకుంట తండాలో ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన జాటోతు సంక్రు ఇంట్లో 4 లీటర్ల సారా, 50 లీటర్ల బెల్లం పానకాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తుంగతుర్తి ఎక్సైజ్ సీఐ బాలాజీనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సారా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట తిరుమలగిరి ఎస్‌ఐ ప్రసాద్, ఎక్సైజ్ ఎస్‌ఐలు గణేష్, మూర్తి, బాలాజీ, ఆంజనేయులు పాల్గొన్నారు.

రామన్నపేట ఎక్సైజ్ సీఐ ఆధ్వర్యంలో..

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని పోర్లగడ్డ, కడపగండి, డాకుతండా, వాచ్యాతండాల్లోని సారా తయారీ స్థావరాలపై గురువారం రామన్నపేట ఎక్సైజ్ సీఐ నాగలత ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 200 లీటర్ల బెల్లం పానకం పారబోశారు. క్వింటాల్ బెల్లం స్వాధీనం చేసుకున్నారు. సారా తయారు చేస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని, తహసీల్దార్ పల్లవిరెడ్డి ఎదుట బైండోవర్ చేశారు. సీఐ మాట్లాడుతూ సారా తయారు చేస్తూ మొదటి సారి కేసు, రెండోసారి కేసుతో పాటు రూ.లక్ష జరిమాన విధిస్తామని హెచ్చరించారు. వారి వెంట ఎస్‌ఐలు శంకర్, శోభరాణి, సిబ్బంది తిరుమలేష్, వీరయ్య, రాహుజి, స్వప్న తదితరులున్నారు.

బంగారు మైసమ్మ ఆలయ నిర్మాణానికి ఏర్పాట్లు



ఏర్పాట్లు చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

చౌటుప్పల్: చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రాంగణంలో శ్రీబంగారు మైసమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి సంబంధించిన ఏర్పాట్లు గురువారం ప్రారంభమయ్యాయి. సీహెచ్‌సీ భవనం వెనుక ఉన్న పాత ఆస్పత్రి ప్రాంగణంలో దశాబ్దాల క్రితం బంగారు మైసమ్మ ఆలయాన్ని నిర్మించారు. ఇటీవల మంజూరైన 100 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి పాత ఆస్పత్రి భవనం (మండల వైద్యశాల, జిల్లా ఉపవైద్యాధికారి కార్యాలయం) పూర్తిగా కూల్చివేశారు. ప్రాంగణంలోని పాలియేటివ్ కేర్ యూనిట్, సిబ్బంది క్వార్టర్‌లను సైతం నేలమట్టం చేశారు. ఈ క్రమంలో ప్రాంగణంలో బంగారు మైసమ్మ ఆలయాన్ని యథావిధిగా విడిచిపెట్టారు. త్వరలోనే వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది బంగారు మైసమ్మ ఆలయాన్ని మరో చోటుకు తరలించాలని నిర్ణయించారు. ఈమేరకు సంబంధిత సిద్ధాంతులతో చర్చించారు. ఆలయాన్ని నిర్మించే ప్రదేశంలో గురువారం ఏర్పాట్లు ప్రారంభించారు. ఈ ఆదివారం లేదంటే వచ్చే ఆదివారం ప్రతిష్ఠాపన వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

- 20కి పైగా దొంగతనం కేసుల్లో నిందితుడిగా గుర్తింపు
- 9 బైక్‌లు స్వాధీనం



పట్టుబడిన నిందితుడిని చూపుతున్న డీఎస్పీ, సీఐ

కోదాడరూరల్: రెండు తెలుగు రాష్ట్రాల్లో బైక్‌లను చోరీ చేస్తున్న వ్యక్తిని గురువారం కోదాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణంలోని నయానగర్‌కు చెందిన గుండపనేని సందీప్ దొంగతనాన్ని వృత్తిగా ఎంచుకున్నాడు. చోరీ చేసిన సామగ్రి, బైక్‌లను విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తుండేవాడు. పలు ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలను దొంగలించిన 20 పైగా కేసుల్లో జైలు జీవితం కూడా గడిపాడు. గురువారం ఉదయం పట్టణ సీఐ రాము తన సిబ్బందితో కలిసి దుర్గాపురం జంక్షన్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా సందీప్ బైక్‌పై జగ్గయ్యపేట వైపు అనుమానాస్పదంగా వెళ్తూ కనిపించాడు. పాత నేరస్తుడనే అనుమానంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన దొంగతనాలను ఒప్పుకున్నాడు. రెండు నెలల కాలంలో కోదాడ రూరల్, మునగాల, చిలుకూరు ఖమ్మం పట్టణ స్టేషన్, వైరా స్టేషన్‌ల పరిధిలో 9 బైక్‌లను చోరీ చేసినట్లు తెలిపారు. ఈ బైక్‌లను పట్టణ సమీపంలోని అల్వాలపురంలో గల వెంచర్‌లో దాచినట్లు పేర్కొన్నారు. బైక్‌లను స్వాధీనం చేసుకొని పట్టణ స్టేషన్‌కు తరలించి నిందితుడిని కోర్టుకు రిమాండ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ రాము, సిబ్బంది యల్లారెడ్డి, సతీష్‌నాయుడు, బత్తిని నాగేశ్వరరావులను డీఎస్పీ అభినందించారు.

నేరాల నియంత్రణకు నిబద్ధతతో పనిచేయాలి

- డీసీపీ రాజేశ్‌చంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ, పాల్గొన్న పోలీసు అధికారులు

వలిగొండ : నేరాల నియంత్రణకు పోలీసులు నిబద్ధతతో పని చేయాలని డీసీపీ రాజేశ్‌చంద్ర సూచించారు. గురువారం వలిగొండ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన చౌటుప్పల్ డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డివిజన్‌లోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. గంజాయి రవాణాను అరికట్టడానికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. కుటుంబ తగాదాలకు సంబంధించి కౌన్సిలింగ్ ద్వారా పరివర్తన తీసుకురావడానికి భువనగిరిలో భరోసా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భూవివాదాల్లో పరిమితికి లోబడి పని చేయాలని సూచించారు. సమావేశంలో చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్య, సీఐలు మోతిరాం మహేష్, దేవేందర్, ఎస్‌ఐలు ప్రభాకర్, దిలీప్, రాఘవేందర్, నాగరాజు, విక్రమ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నాగరాజు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ వైఎస్ చలవే..

- డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్ : రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డిదేనని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన బీబీనగర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఉచిత్ విద్యుత్ విషయంలో కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలను బీఆర్ఎస్ తప్పు పడుతూ ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రైతుల కోసం ఉచిత విద్యుత్ తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని, రూ.60వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత కూడా తమ ప్రభుత్వానిదేనన్నారు. రేవంత్ రెడ్డి మాటలను బీఆర్ఎస్ నాయకులు వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, వారి కుట్రలను తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె శిబిరాని సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సత్తిరెడ్డి, నరేందర్‌రెడ్డి, బస్వయ్య, ఆగమయ్య, మనోహర్, ప్రవీణ్, ప్రభాకర్, రాజేశ్వర్, జానీ, నర్సిరెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



ఆవుల పాండయ్య (ఫైల్)

నల్లగొండ క్రైం: పట్టణంలోని నార్కట్‌పల్లి– అద్దంకి రహదారిపై ఆర్జాల బావి వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని అతివేగంగా హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నల్లగొండ రూరల్ ఎస్సై కంచర్ల భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్జాలబావికి చెందిన ఆవుల పాండయ్య(66) బైక్‌పై తన వ్యవసాయ బావి వద్దకు వెళ్తున్నాడు. రోడ్డును దాటుతున్న క్రమంలో మిర్యాలగూడెం నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి పాండయ్య బైక్‌ను ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. భార్య కౌసల్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆరుగురు జూదరులపై కేసు

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణ శివారులోని మర్రిగూడలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు నల్ల గొండ రూరల్ ఎస్సై భాస్కర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వారి వద్ద రూ.43,190 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, 3 బైక్‌లు, కుర్చీలు, టేబుల్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణ పరిధిలో పేకాట స్థావరంపై ఎస్వోటీ పోలీసులు దాడులు చేశారు. స్థానిక సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని ఓ రిసార్ట్స్‌లో ప లువురు పేకాట ఆడుతుండగా గురువారం సాయంత్రం ఎస్వోటీ పోలీసులు దాడులు చేశారు. ఇందులో 10 మంది పట్టుబడగా.. వారి నుంచి రూ.13,900 నగదు, 10 సెల్‌ఫోన్లు, 5 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్వోటీ పోలీసులు వీరిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

కాపురానికి తీసుకెళ్లడం లేదని..

- భర్త ఇంటి ఎదుట ఆందోళన

చింతపల్లి: తనను వివాహం చేసుకున్నాడని, కానీ కాపురానికి తీసుకెళ్లడం ఓ యువతి తన భర్త ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. ఈ ఘటన గురువారం చింతపల్లి మండల పరిధిలోని గడియగౌరారంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన సరిత, చింతపల్లి మండల పరిధిలోని గడియగౌరారం గ్రామానికి చెందిన నడింపల్లి శ్రీనివాస్ గత రెండు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. గత వారం రోజుల క్రితం ఇరువురు హైదరాబాద్ వెళ్లి వివాహం చేసుకున్నారు. అనంతరం శ్రీనివాస్ సరితను కాపురానికి తీసుకెళ్లకుండా దూరంగా ఉంచుతున్నాడు. దీంతో తనకు న్యాయం చేయాలంటూ సరిత శ్రీనివాస్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. విషయం తెలుసుకున్న చింతపల్లి ఎస్‌ఐ సతీష్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువురి తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి, అక్కడి నుంచి దేవరకొండ డీఎస్పీ కార్యాలయానికి పంపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్ తన భార్యను కాపురానికి తీసుకెళ్లాడు.

భార్యాభర్తలపై దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు

చివ్వెంల(సూర్యాపేట): భూ వివాదంలో భార్యాభర్తలపై దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధునాయుడు తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండల పరిధిలోని కుడకుడ గ్రామ శివారులోని సర్వేనంబర్ 309లో 2 ఎకరాల 6 గుంటల స్థలాన్ని 8 మంది కలిసి కొనుగోలు చేశారు. ఈ భూమిలో సూర్యాపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు నట్టి సృజన్‌కుమార్‌కు 20 గుంటల భూమి ఉంది. అతనితో పాటు దాని పక్కనే పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు వల్లెం శంకర ప్రసాద్‌కు కొంత భూమి ఉంది. ఈక్రమంలో పక్కన భూమి ఉన్న మరో వ్యక్తి గురువారం తన స్థలానికి హద్దురాళ్లు పాతే క్రమంలో సృజన్‌కుమార్, శంకర్ ప్రసాద్‌కు సమాచారం అందించడంతో వారిద్దరూ అక్కడకు వెళ్లారు. ఆ ప్రదేశంలో హద్దురాళ్ల విషయంలో వివాదం చోటుచేసుకుంది. సృజన్ కుమార్‌పై శంకర్ ప్రసాద్, ఆయన స్నేహితుడు పాల సైదులు కలిసి దాడికి పాల్పడ్డాడు. దీంతో గాయాల బారిన పడిన సృజన్ కుమార్ ఈ విషయాన్ని తన భార్య జ్యోతికి తెలుపడంతో ఆమె సంఘటన స్థలానికి చేరకుంది. ఆమెపై కూడా దాడికి పాల్పడటంతో ఇరువురికి గాయాలయ్యాయి. బాధితులను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. సృజన్‌కుమార్ ఫిర్యాదు మేరకు శంకర్‌ప్రసాద్, పాలకూరి సైదులుపై ఎస్‌ఐ మధునాయుడు కేసు నమోదు చేశారు.

హుజూర్‌నగర్‌లో వాహనాల తనిఖీ

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లో పోలీసులు గురువారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిని, మైనర్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు. తనిఖీల్లో గరిడేపల్లి ఎస్‌ఐ వెంకటరెడ్డి, స్పెషల్ పార్టీ పోలీసులు ఉన్నారు.

స్వీపర్ల వేతనాలు పెంచాలి



సమ్మె చేస్తున్న స్వీపర్లు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు తమ వేతనాలు పెంచాలని 13 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గంటా నాగయ్య అన్నారు. గురువారం సూర్యాపేటలో స్వీపర్లు చేపట్టిన సమ్మెకు ఇఫ్టూ, ఏఐకేఎంఎస్, పీడీఎస్‌యూ సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న వర్కర్లకు కనీస వేతనాలను అమలు చేయకుండా శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.27 వేల వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డు శంకర్, అలుగుబెల్లి వెంకటరెడ్డి, పిడిఎస్‌యు పిడమర్తి భరత్, జిల్లా అధ్యక్షులు నార్ల పరశురాములు, ప్రధాన కార్యదర్శి ఎస్కే రసూల్, చిక్కుల వెంకటేశ్వర్లు, జానకి, కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి



జెడ్పీ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న స్వీపర్లు

నల్లగొండ టౌన్ : మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల పరిషత్ స్కూల్ స్వీపర్ల సంఘం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట దీక్ష చేశారు. ఈ దీక్షలో దండెంపల్లి సత్తయ్య పాల్గొని మాట్లాడుతూ అతి తక్కువ వేతనంతో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న స్వీపర్లు దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమానం వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పనస నర్సింహగౌడ్, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, పి.ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి ఎండీ అనీఫ్, కె.యాదగిరి, పూలమ్మ, ఎం.నాగయ్య, లింగయ్య, ఎం.దేవి, కోటయ్య, వెంకటనారాయణ పాల్గొన్నారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్ అత్యుత్సాహం

- డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లో ఓ వ్యక్తిని లాఠీతో కొట్టడంతో విరిగిన చేతి వేళ్లు
- ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎదుట బాధితుడి బంధువుల ఆందోళన



ధర్నా చేస్తున్న బాధితుడి బంధువులు



బాధితుడు సైదులు

మిర్యాలగూడ అర్బన్: డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లో ట్రాఫిక్ కానిస్టేబుల్ అత్యుత్సాహం ప్రదర్శించాడు. మద్యం సేవించి పట్టుబడిన వ్యక్తిని లాఠీతో కొట్టడంతో అతడి చేతి వేళ్లు విరిగాయి. ఈ సంఘటన మిర్యాలగూడ పట్టణంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం బాబుసాయిపేట గ్రామానికి చెందిన ఎర్ర సైదులు డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం తన విధులు ముగించుకుని బైక్‌పై స్వగ్రామం బాబుసాయిపేటకు వెళ్తున్నాడు. ఈక్రమంలో పట్టణంలోని ఎఫ్‌సీఐ సమీపంలో ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్నారు. బైక్‌పై వచ్చిన సైదులును ఆపిన ట్రాఫిక్ కానిస్టేబుల్ సుధీర్ బైక్ తాళం చెవిని లాక్కున్నాడు. తాను మద్యం తాగానని, బ్రీత్ ఎనలైజర్ ఊదుతానని చెప్పాడు. దీంతో కానిస్టేబుల్ అతడిని తీవ్ర పదజాలంతో దూషించాడు. ఎందుకు తిడుతున్నావని, ఫైన్ కూడా కడతానని, నా బైక్ తాళం చెవిని ఇవ్వాలని సైదులు కోరగా.. కోపోద్రిక్తుడైన కానిస్టేబుల్ లాఠీతో సైదులు చేతిపై తీవ్రంగా కొట్టాడు. పోలీసులు అతడిని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు చేతి వేళ్లు విరిగినట్లు చెప్పారు. సైదులును కానిస్టేబుల్ లాఠీతో కొట్టిన వీడియోలు సోషల్‌మీడియాల్లో వైరల్ అవుతున్నాయి. ఈ విషయంపై టూటౌన్ సీఐ నరసింహారావును వివరణ కోరగా మద్యం సేవించి ఉన్న వ్యక్తిని నియంత్రించేందుకు కానిస్టేబుల్ తన విధులు నిర్వహించాడని, కావాలని చేసింది కాదని పేర్కొన్నారు.

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన..

డ్రంక్ అండ్ డ్రైవ్ పేరుతో చేతి వేళ్లు విరిగేలా కొట్టడంతో బాధితుడి బంధువులు, తోటి డ్రైవర్లు గురువారం మిర్యాలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. టూ టౌన్ సీఐ నరసింహారావు అక్కడకు చేరుకుని వారితో మాట్లాడి ఆందోళన విరమింపచేశారు. ఎర్ర సైదులు ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

చిన్నారులకు అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న క్లబ్ సభ్యులు

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడంలో భాగంగా గురువారం లయన్స్‌క్లబ్ ఆఫ్ నల్లగొండ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలోని సరస్వతీదేవి మందిరంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. విద్యార్థులకు పలకలు, వాటర్ బాటిళ్లు, ప్లేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్, క్లబ్ అధ్యక్షుడు ఎల్‌వీ కుమార్, కార్యదర్శి మందడి నర్సిరెడ్డి, కోశాధికారి వీరెల్లి సత్యనారాయణ, కోడె సతీష్‌కుమార్, గట్టుపల్లి అశోక్‌రెడ్డి, చిలుకూరి రామకృష్ణ పాల్గొన్నారు.

నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ

చండూరు : చండూరు ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదివే తల్లిదండ్రులు లేని పేద విద్యార్థులకు సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోటు బుక్స్, పెన్నులు, పెన్సిళ్లను ప్రభుత్వ ఉపాధ్యాయుడు గురిజ మహేష్ గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో చండూరు జిల్లా పరిషత్ పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎడ్ల భిక్షం, ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు షేక్ ఇమామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్, ఆట వస్తువులు, షూ పంపిణీ

నార్కట్‌పల్లి : మండలంలోని నక్కలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ గ్రామానికి చెందిన బండ అమృతారెడ్డి కోడుకు, కోడలు భారతీయ విద్యా భవన్ డైరెక్టర్ బండ రమాదేవి అశోక్‌రెడ్డి గురువారం నోట్‌బుక్స్, ఆట వస్తువులు, షూ అందజేశారు.

కలెక్టర్‌కు వినతి

నల్లగొండ టౌన్ : గొర్రెల పంపిణీ పథకం లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని కోరుతూ గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య గురువారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఆయన వెంట బండా శ్రీశైలం, గంజి మురళీధర్, మల్లేష్, కొండా వెంకన్న, సాగర్ల లింగస్వామి, రవీంద్రకుమార్, సన్యాసిరావు ఉన్నారు.

విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని..

నల్లగొండ : పట్టణంలోని ప్రతీక్‌రెడ్డి జూనియర్ కళాశాల ఎదుట కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం కేవీఆర్ యువసేన ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేశారు. యువసేన అధ్యక్షుడు మహ్మద్ ఇంతియాజ్ అలీ, అఫ్జల్ ఖాన్, గౌస్‌లు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

నకిరేకల్ : వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన నక్క సురేష్ రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తల పగిలి కోమాలోకి వెళ్లాడు. దీంతో అతడిని కుటుంబ సభ్యులు నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. గురువారం బాధిత కుటుంబ సభ్యులను నకిరేకల్‌కు చెందిన లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధి బ్రహ్మదేవర నరేష్ పరామర్శించి రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన మల్లె సైదులు కుటుంబానికి బీఆర్‌ఎస్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పాశం రాంరెడ్డి గురువారం రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. సర్పంచ్‌లు రొట్టెల రమేష్, పోకల సతీష్ పాల్గొన్నారు.

మాడుగులపల్లి : మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన సింగం జానమ్మ ట్రాక్టర్ బోల్తాపడి మృతి చెందింది. గురువారం జానమ్మ మృతదేహాన్ని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజు యాదవ్ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. అంతకుముందు బీఆర్‌ఎస్ జెడ్పీఫ్లోర్ లీడర్ పాశం రాంరెడ్డి, తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ తండు సైదులుగౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల చొప్పున సాయంగా అందించారు. సర్పంచ్ శివ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

‘కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు’

నల్లగొండ టూటౌన్ : రైతులపై కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి లేదని, అధికార యావతో ఉన్న కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మితే ప్రజలను నిండా ముంచుతారని నల్లగొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చీర పంకజ్‌యాదవ్ అన్నారు. గురువారం వీటీ కాలనీలోని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 3 గంటలు కూడా కరెంట్ రావడం లేదన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నామని అన్నారు.

చెత్త సేకరించిన సర్పంచ్

నార్కట్‌పల్లి : గ్రామ పంచాయతీ సిబ్బంది సమ్మె చేస్తుండడంతో చెర్వుగట్టు గ్రామంలోని వీధుల్లో చెత్త పేరుకుపోయింది. దీంతో సర్పంచ్ మల్ల బాలకృష్ణ, ఉప సర్పంచ్ దోనాల శంకర్‌రెడ్డి స్వయంగా ట్రాక్టర్‌లో చెత్త సేకరించారు.



ట్రాక్టర్‌లో చెత్త తీసుకెళ్తున్న సర్పంచ్

సబ్ స్టేషన్ల ఎదుట బీఆర్ఎస్ ఆందోళనలు

నల్లగొండ టూటౌన్ : ఉచిత విద్యుత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ పట్టణంలోని సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మకు క్రేన్‌తో ఉరివేసి దహనం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి తన వ్యాఖ్యలు వెంటనే ఉపసంహరించుకుని రైతాంగానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్‌వలి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మార్కెట్ చైర్మన్ చీర పంకజ్‌యాదవ్, మాలె శరణ్యారెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, జమాల్ ఖాద్రీ, బోనగిరి దేవేందర్, గోగుల శ్రీనివాస్, ఎడ్ల శ్రీనివాస్, భాస్కర్‌గౌడ్, ఇబ్రహీం, ఊట్కూరి వెంకట్‌రెడ్డి, రావుల శ్రీనివాస్‌రెడ్డి, దుప్ప రూప, జయప్రదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో..

సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి దిష్టిబొమ్మను గురువారం నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల వద్ద బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో దహనం చేశారు. బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జునముదిరాజ్, నోముల క్రాంతి కుమార్, సురేష్, అశోక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రామగిరి(నల్లగొండ) : రైతులకు ఉచిత కరెంటుపై పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ తిప్పర్తి మండలంలోని సబ్ స్టేషన్ల ఎదుట బీఆర్‌ఎస్ నాయకులు నిరసనలు ప్రదర్శించారు. తిప్పర్తి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పాశం రాంరెడ్డి, ఇండ్లూరులో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, రాయినిగూడెంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు ముత్తినేని శ్యాంసుందర్, మామిడాలలో ఎంపీటీసీ ఉట్కూరు సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో సబ్‌స్టేషన్ల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మిలింగారావు, సర్పంచ్‌లు రొట్టెల రమేష్, ఎస్‌కె.మోయిజ్, ప్రవీణ్, నాయకులు కందుల లక్ష్మయ్య, జాకటి మోషె పాల్గొన్నారు.

అప్పాజిపేటలో బీఆర్‌ఎస్ ధర్నా

నల్లగొండ రూరల్ : టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా నల్లగొండ మండలంలోని అప్పాజిపేట గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. సర్పంచ్ రవీందర్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ తవిటి కృష్ణ, రైతు సంఘం నాయకులు గోపాల్‌రెడ్డి, శ్రీను, స్వామి, మహేందర్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

కనగల్ : పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు తక్షణమే క్షమాపణ చెప్పాలని కోరుతూ గురువారం మండల వ్యాప్తంగా విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎంపీపీ కరీంపాషా, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు వంగాల సహదేవరెడ్డి, దోటి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రాంగిరి శ్రీధర్‌రావు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్, జొన్నలగడ్డ శేఖర్‌రెడ్డి, ఎర్రబెల్లి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



నకిరేకల్ : ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



కట్టంగూర్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



తిప్పర్తి సబ్‌స్టేషన్ ఎదుట..



కనగల్ : పానుగోడు సబ్‌స్టేషన్ వద్ద..



నార్కట్‌పల్లి : రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చీకటి రోజులే

నకిరేకల్ : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మళ్లీ వ్యవసాయ రంగానికి చీకటి రోజులు వస్తాయని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. ఉచిత కరెంటు సరఫరాపై కాంగ్రెస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం నిరసన ప్రదర్శన చేసి ధర్నా చేశారు. అనంతరం టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బీఆర్‌ఎస్ వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కాంగ్రెస్ వారు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. 24 గంటల కరెంటు ఇస్తుంటే కాంగ్రెస్ నేతలు 3 గంటల కరెంటు చాలు అని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, జెడ్పీటీసీలు మాద ధనలక్ష్మీనగేష్, తలారి బలరాం, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, పీఎసీఎస్ చైర్మన్ పల్‌రెడ్డి మహిందర్ రెడ్డి, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, యల్లపురెడ్డి సైదిరెడ్డి పాల్గొన్నారు.

శాలిగౌరారంలో..

శాలిగౌరారం : టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాక్యలను నిరసిస్తూ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట గురువారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న, సింగిల్‌విండో చైర్మన్ తాళ్ళూరి మురళి, రైతు బంధు మండల కోఆర్డినేటర్ గుండా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి : వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అవసరం లేదని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ గురువారం బీఆర్‌ఎస్ నాయకులు కేతేపల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మాజీ చైర్మన్ చల్ల కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చిమట వెంకన్న, సర్పంచులు కోట వెంకటేశ్వరావు, కట్ట శ్రవణ్, బచ్చు జానకిరాములు తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూర్‌లో..

కట్టంగూర్ : రాష్ట్రంలో ఉచిత కరెంటు సరఫరాపై కాంగ్రెస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, జెడ్పీటీసీ తరాల బలరాములు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, బీఆర్‌ఎస్ఎస్ మండల అధ్యక్షుడు గుండగోని రాములు పాల్గొన్నారు.

చిట్యాలలో..

చిట్యాల : రైతాంగానికి నిరంతరాయంగా ఉచిత విద్యుత్ ఇవ్వడాన్ని తప్పుపట్టిన టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి వెంటనే రైతులకు క్షమాపణ చెప్పాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. వెలిమినేడు గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట గురువారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. చిట్యాల పట్టణ శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిర్వహించిన ధర్నాలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జడల ఆదిమల్లయ్యలు పాల్గొన్నారు. వెలిమినేడులో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కొలను సునిత వెంకటేష్‌గౌడ్, జెడ్పీటీసీ సుంకరి ధనమ్మ యాదగిరిగౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆవుల అయిలయ్య, ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లారెడ్డి పాల్గొన్నారు.

నార్కట్‌పల్లిలో..

నార్కట్‌పల్లి : రాష్ట్రంలో ఉచిత విద్యుత్ సరఫరాపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ గురువారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ల ఎదుట ధర్నా చేసి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, యానాల అశోక్‌రెడ్డి, ఎంపీటీసిలు మేకల రాజిరెడ్డి, పుల్లెంల ముత్తయ్య, చిరుమర్తి యాదయ్య, దుబ్బాక పావనిశ్రీధర్, అంజయ్య, సర్పంచ్‌లు గోసుల భద్రాచలం, బాలకృష్ణ, వరలక్ష్మి రాంరెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు దోసపాటి విష్ణుమూర్తి, అల్లుబెల్లి సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండల కేంద్రంలోని అంబేడ్కర్ పార్కు చౌరస్తా సుందరీకరణ పనులకు బీఆర్‌ఎస్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పాశం రాంరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్‌లు రొట్టెల రమేష్, పోకల సతీష్, గుండా సత్యనారాయణ, జాకటి మోషె, కిన్నెర అంజి, నలపరాజు శ్రీనివాస్, ఉయ్యాల నాగరాజు పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

కేతేపల్లి : మండలంలో 2023, జూన్ 18 తేదీ వరకు కొత్తగా భూమి పట్టాదారు పాసు పుస్తకం వచ్చిన రైతులు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.పురుషోత్తం కోరారు. కేతేపల్లిలోని వ్యవసాయ కార్యాలయంలో గురువారం ఆయన రైతుబీమా దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. ఆగస్టు 5తేదీలోగా పత్రాలను ఏఈఓలకు అందజేయాలని సూచించారు.

సమావేశాలను జయప్రదం చేయాలి

చండూరు : ఈ నెల 18, 19 తేదీల్లో నాగార్జునసాగర్‌లో జరిగే అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం కేంద్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం కేంద్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య కోరారు. చండూరులో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

మార్కెట్‌లోకి నూతన కారు విడుదల



కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే

నల్లగొండ రూరల్ : సన్‌సాయ్ హుందాయ్ షోరూంలో నూతన మైక్రో ఎస్‌యూవీ ఎక్స్‌టర్ కారును బుధవారం రాత్రి మంత్రి జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, సన్‌సాయ్ హుందాయ్ ఎండీ విజయ్‌మోహన్ శివం మార్కెట్‌లోకి విడుదల చేశారు. మ్యాన్యువల్, ఆటోమెటిక్ వేరియంట్లలో, సీఎన్‌జీ వేరియంట్‌లో కారు లభిస్తుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

నల్లగొండ టూటౌన్ : సీజనల్ వ్యాధుల పట్ల క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి అన్నారు. సీజనల్ వ్యాధులపై మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ ఉద్యోగులకు, వైద్య ఆరోగ్య సిబ్బందికి నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైనందున పట్టణంలోని అన్ని కాలనీల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపాలిటీ, వైద్య ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలు సీజన్ వ్యాధుల బారిన పడకుండా చొరవ తీసుకోవాలన్నారు. అంతకు ముందు పట్టణంలో ఇరు శాఖల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె.వీ. రమణాచారి, జిల్లా మలేరియా అధికారి రుద్రాక్షి దుర్గయ్య , ఎంటమాలజిస్ట్ గంగప్ప తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

మున్సిపల్ కార్మికులకు ఏరియర్స్ చెల్లించాలి



సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు

చండూరు : మున్సిపల్ కార్మికులకు 10 నెలల ఏరియర్స్ వెంటనే చెల్లించాలని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బొట్ట శివకుమార్, సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు నల్లగంటి లింగస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఎసమ్మె చేపట్టారు. ఈ సమ్మెలో వారు పాల్గొని మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు ఎలాంటి వైద్య సదుపాయాలు కల్పించకపోయినా మున్సిపల్ కార్యాలయం నుంచి పది లక్షల రూపాయలు డ్రా చేశారని ఆరోపించారు. మే డే సందర్భంగా పెంచిన వెయ్యి రూపాయలను వెంటనే చెల్లించాలని, ప్రతినెలా ఐదో తేదీన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమ్మెకు సీపీఎం నాయకులు మొగుదాల వెంకటేశం , జెరిపోతుల ధనంజయ్ మద్దతు తెలిపారు. మున్సిపల్ కార్మికులు నాగరాజు, యాదయ్య, నాగరాజు, సైదులు, చిన్న వెంకన్న, అలివేలు, కళమ్మ, జంగమ్మ, ముత్తమ్మ, విమల పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

నల్లగొండ టౌన్ : బీసీల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. గురువారం మునుగోడు రోడ్డులో జ్యోతిరావు పూలే బీసీ కమ్యూనిటీ హాల్ భవనంతోపాటు వివిధ కుల సంఘాలకు చెందిన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీ కులవృత్తుల వారికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అన్నారు. మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రామరాజు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, నల్ల సోమమల్లయ్య, వైద్యం వెంకటేశ్వర్లు, సత్యనారాయణ ముదిరాజ్, కేశబోయిన శంకర్ ముదిరాజ్, కాశయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బీసీ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి

మునుగోడు : ఇళ్లలో వాడిన ప్రతి నీటి బొట్టు భూమిలో ఇంకేవిధంగా ప్రతిఒక్కరు తమ ఇళ్ల ఎదుట ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని అడిషనల్ డీఆర్‌డీఓ శైలజ సూచించారు. మునుగోడులో నూతనంగా నిర్మించిన ఇంకుడు గుంతలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు ప్రజలను చైతన్యం చేసి ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చూడాలని కోరారు. ఎంపీపీ కర్నాటి స్వామి, ఏపీడీ ఉపేందర్ రెడ్డి, సర్పంచ్ మిర్యాల, ఎంపీడీఓ భాస్కర్, ఎంపీఓ సుమలత, పంచాయతీ కార్యదర్శి మురళీ కృష్ణ ఉన్నారు.

విద్యార్థి సంఘాల నాయకులపై దాడి హేయమైన చర్య

నల్లగొండ టౌన్ : రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులపై ఖమ్మంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం దాడి చేయడం హేయమైన చర్య అని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లం మహేష్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగెల వెంకటేష్ అన్నారు. దాడిని నిరసిస్తూ గురువారం స్థానిక సుభాష్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. బంద్ చేయడానికి వెళ్లిన విద్యార్థి సంఘం నాయకులపై ప్రైవేటు వ్యక్తులతో దాడి చేయించారని వెంటనే స్కూల్ గుర్తింపు రద్దు చేసి దాడి చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే అధికారం

మునుగోడు : రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుపొంది అధికారంలోకి వస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలమల్ల కృష్ణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం మునుగోడు మండలంలోని కోతులారం గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు కృష్ణారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. పార్టీలో చేరినవారిలో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన గుండు చెన్నకృష్ణ గౌడ్, కందుల పెంటయ్య, కందుల రవితోపాటు మరో 30 మందికిపైగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురిగి నర్సింహగౌడ్, ప్రవీణ్, యాదయ్య, సూర్యప్రకాష్, వెంకటేష్, హరికృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

నాంపల్లి : రాష్ట్రం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. నాంపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జీపీ కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ గఫార్, నిమ్మల వెంకట్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము భిక్షం, మండల మహిళా అధ్యక్షురాలు అస్రాబీ, చాందుపాషా, ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు రాచకొండ భార్గవ్, మల్లేపల్లి వెంకట్‌రెడ్డి, హనుమంతాచారి, మట్టిపల్లి యాదయ్య, నాంపల్లి సంజీవ, వేలాద్రి పాల్గొన్నారు.



మునుగోడు : పార్టీలోకి ఆహ్వానిస్తున్న కృష్ణారెడ్డి

బొడ్రాయికి జలాభిషేకం

చిట్యాల : చిన్నకాపర్తి గ్రామంలో గురువారం మహిళలు బొడ్రాయికి బిందెలతో జలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బొడ్డు రాజేశ్వరి, ఎల్లమ్మ, గ్రామస్తులు పాకాల నర్సింహ, రుద్రారపు శ్రీను, సోమయ్య, రాంకుమార్ పాల్గొన్నారు.

గోరింటాకు సంబురం

నల్లగొండ టూటౌన్ : ఆషాడమాసం సందర్భంగా నల్లగొండలోని వినాయక హౌజింగ్‌బోర్డు కాలనీలో గోరింటాకు ఉత్సవాన్ని మహిళలు నిర్వహించుకున్నారు. కాలనీ మహిళలందరూ ఒకేచోట చేరి గోరింటాకు పెట్టుకొని ఆషాడ సంబురం చేసుకున్నారు.



గోరింటాకు నూరుతున్న మహిళలు

కళ్లకు గంతలతో పంచాయతీ కార్మికుల నిరసన

నకిరేకల్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్‌లో గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె శిబిరంలో గురువారం కార్మికులతో ఎమ్మెల్యే మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమ్మెకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాతాకుల అంజయ్య, నక్కరాంబాబేష్, న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు అంబటి చిరంజీవి మద్దతు తెలిపారు. పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీశైలం, మండల అధ్యక్షుడు పల్స సైదులు, నాగరాజు, సోములు, వేణు, శంకర్ పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్ : గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ నల్లగొండ మండల కన్వీనర్ పోలే సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాములు, ఎల్లేష్, అనిల్, నరేష్, శ్రీశైలం, నవనీత, పోతెపాక నవీన్, ఈశ్వర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రామగిరి(నల్లగొండ): గ్రామ పంచాతీయ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు తండు సైదులుగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జీపీ కార్మికుల సమ్మెకు గురువారం మద్దతు తెలిపి మాట్లాడారు. సీఐటీయూ మండల కన్వీనర్ భీమగాని గణేశ్, వార్డు మెంబర్ బత్తుల సోమరాజు, జీపీ కార్మికులు పాల్గొన్నారు.

కేతేపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె గురువారం ఎనిమిదో రోజుకు చేరుకుంది. ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించిన భిక్షాటన చేశారు. ఏడాకుల కోటయ్య, ఆశీర్వాదం, సైదులు, వెంకటేష్, మహేష్, జానయ్య, దేవయ్య, బాలశౌరి, జ్యోతి, శోభ, రమణ, పూలమ్మ, రావులమ్మ, ప్రసన్న పాల్గొన్నారు.

కట్టంగూర్ : తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పంచాయతీ కార్మికులు ముఖానికి నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. సమ్మెకు ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య సంఘీభావం తెలిపారు. పంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పొన్న అంజయ్య, కొండయ్య, కాపుగొంటి శ్రీను, కానుగు వెంకన్న, యాదగిరి, వినోద, నర్సింగు శ్రీను, ఎల్లమ్మ, లక్ష్మి, యాదయ్య పాల్గొన్నారు.

నాంపల్లి : మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు పలు ప్రజాసంఘాలు, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారి ఐలయ్య, జిల్లా అధ్యక్షుడు వెంకన్న, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ అంజాచారి, సుదనబోయిన రమేష్, నాంపల్లి చంద్రమౌళి, మారుపాక వెంకటయ్య, గిరి రమా, కొమ్ము భిక్షం, కార్మికులు పాల్గొన్నారు.

మునుగోడు : సమ్మెలో భాగంగా పంచాయతీ కార్మికులు గురువారం మునుగోడులో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. రెడ్డిమల్ల యాదగిరి, పందుల నర్సింహ, అరుణ, బుచ్చమ్మ, పెద్దమ్మ, ఎల్లమ్మ, అండాలు, పార్వతమ్మ, లింగయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల : మండల కేంద్రంలో జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె శిబిరాన్ని గురువారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లోడంగి శ్రవణ్‌కుమార్ సందర్శించి మద్దతు తెలిపారు. గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు బొడిగె సైదులు, సీపీఐ మండల సహాయ కార్యదర్శి జిల్లా సత్యం, పట్టణ కార్యదర్శి ఎస్‌కే.షరీఫ్, మేకల భిక్షం, రావుల చిన్న వెంకన్న, దండిగ నర్సింహ పాల్గొన్నారు.

చండూరు : గ్రామపంచాయతీ కార్మికులు 8వ రోజు సమ్మెలో భాగంగా గురువారం మండల కేంద్రంలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బొట్ట శివకుమార్, సీఐటీయూ మండల కన్వీనర్ మొగుదాల వెంకటేష్, తెలంగాణ పంచాయతీ వర్కర్స్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఏర్పుల సైదులు, నాంపల్లి శంకర్, సతీష్, భిక్షమయ్య, సురేష్‌నాయక్, దాస్, పుష్పలత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కనగల్ : సమ్మెలో భాగంగా గురువారం జీపీ కార్మికులు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి ర్యాలీ నిర్వహించారు. సంఘం మండల అధ్యక్షుడు జిల్లా విజయ్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కానుగు లింగస్వామి, కొంగల నర్సింహ, దాసరి కిరణ్, లింగయ్య, బాలమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణయ్య, భిక్షం తదితరులున్నారు.

మర్రిగూడ : తమ సమస్యలు పరిష్కరించాలని 8 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, లింగయ్య, రాములు, మంజుల, నరసింహ, సునీత, ముత్తమ్మ పాల్గొన్నారు.



నాంపల్లి : కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు



కేతేపల్లిలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు